తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# నాయుడుపేట సమీపంలో 51 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నాయుడుపేట, మార్చి 27 ప్రభాతవార్త : నాయుడుపేట సమీపంలోని అత్తివరం అటవీ ప్రాంతంలో 51 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో కడప సబ్ డివిజన్ ఆర్ఐ చిరంజీవులు తన టీమ్ ఆర్ఎస్ఐ నరేష్‌లు మంగళవారం తిరుపతి జిల్లా వెంకటగిరి మార్కెట్ చెక్‌పోస్ట్ నుంచి ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేస్తూ, బాలాయపల్లి మండలం నాయుడుపేట రేంజ్‌లోని అత్తివరం పరిధిలోని అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసి వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పట్టుకున్నారు. అతనిని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన సయ్యద్ ముక్తియార్ అలియాస్ బాషా (27)గా గుర్తించారు. అతన్ని విచారించగా, సమీపంలో ఎర్రచందనం దుంగలు దాచి ఉంచిన డంప్ చూపించాడని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. అక్కడ 46 ఎర్రచందనం దుంగలతో పాటు 5 ఎర్రచందనం వృక్షాల వేర్లు ఉన్నాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నాయుడుపేటకు చెందిన ఆంబోతుల రంగయ్య, ఆంబోతుల శివ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న దృశ్యం

## భస్మాసురుడికి ప్రజలు...
# ఓటుతో బుద్ధి చెప్పాలి

**-పలమనేరు ప్రజాగళంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

*కలియుగ భస్మాసురుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఈ భస్మాసురుడికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.బుధవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో పలమనేరు పట్టణం జవిళివీధిలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే టిడిపి,జనసేన,బిజెపి పార్టీలతో కూటమిగా ఏర్పడ్డామన్నారు. రాష్ట్రాన్ని పీడిస్తున్న కలియుగ భస్మాసురుడి నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.నాడు పరమేశ్వరుడు భస్మాసురుడికి వరం ఇస్తే శివుడి తలమీదే చేయిపెట్టాలని చూసాడని..ఈ భస్మాసురుడు ఒక్కచాన్స్ అంటూ అందలమెక్కి ఇప్పుడు మీ తలలమీదే చేయిపెట్టాడన్నారు.రానున్న ఎన్నికలలో ఓటుతో ఈ కలియుగ భస్మాసురుడిని ఓడించే భాధ్యత మీదేనని ప్రజలనుద్దేశించి పేర్కొన్నారు.*

గంగవరం, మార్చి 27 ప్రభాతవార్త : పలమనేరులో ఏర్పాటు చేసిన ప్రజాగళం మొదటి సభకే లక్షలాదిమంది ప్రజలు, అభిమానులు,యువత తరలిరావడం చూస్తుంటే సంతోషంగా ఉందని,ఇది వీక్షించిన ఆ తాడేపల్లె కొంపలో భూకంపం రావడం ఖాయమన్నారు.వైసీపీ పాలనలో అవినీతి అక్రమాలు, అరాచకాలు రాష్ట్రంలో రాజ్యమేలుతున్నాయన్నారు.ఏ ప్రభుత్వం పైన ఇంత వ్యతిరేకత చూడలేదని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడి అధికార పార్టీ ఓటర్ల చూపుకూడా తెలుగుదేశం వైపు చూస్తుందన్నారు, మరో నలభైఐదు రోజుల్లో రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని, అహంకారి సైకో జగన్ రాష్ట్రంలోని అన్ని రంగాలను సర్వ నాశనం చేశాడని తీవ్రంగా విమర్శించాడు,రాయలసీమకు ప్రదానమైన సాగునీటి ప్రాజెక్ట్‌లు కృష్ణాజలాలను రామలసీమకు తీసుకువచ్చిన ఘనత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుదని ఆయన చేపట్టిన ప్రాజెక్ట్‌లను తాను కొనసాగించానని, 90 శాతం పూర్తైన ప్రాజెక్ట్‌లను జగన్ మూలన పడేసి సాగునీరు,త్రాగునీరు ఇవ్వలేని దుస్థితికి వైసీపీ ప్రభుత్వం దిగజారిపోయిందన్నారు. రాయల సీమకు తీరని అన్యాయం చేసిన రాయలసీమ ద్రోహి జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రలజకు పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకునే జలగే జగన్ అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రయోజనం కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఎన్డీయేలో చేరితే మమ్మల్ని వైసీపీ సైకో సభ్యులు విమర్శిస్తున్నారన్నారు,మేము గతంలో ఎన్డీయేలో ఉన్నప్పుడుకూడా మైనారిటీలకు అన్యాయం చేయలేదని మైనారిటీల సంక్షేమం కోసం ఎన్నో సంక్షమ పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. పలమనేరులో మిస్బా కుటుంబాన్ని వైసీపీ వేదించడంతో ఇప్పుడు అన్యాయం జరిగిన మిస్బా కుటుంబం వలస వెళ్ళిపోవడం దారుణమన్నారు.సైకో జగన్ నవరత్నాల పథకాల పేరుతో ప్రజల బ్యాంకు ఖాతాలలో నగదును జమ చేస్తున్నామని చెబుతూనే వివిధ రూపాలలో పన్నులు పెంచి పేద మధ్య తరగతి ప్రజల జేబులను గుల్లచేస్తూ ప్రజలను దగా చేస్తున్నాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో దశల వారీగా మద్యపాన నిషేదం చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి దానిద్వారా వచ్చే ఆదాయాన్ని చూపి బ్యాంకులలో బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా అప్పులు తీసుకొని మద్యనిషేధం చేయడం లేదని చెప్పకనే చెప్పారు.తన అనుచరులు తయారు చేసిన కల్తీ మద్యం రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్మి అమాయకుల ప్రాణాలు తీస్తూ ఎందరో ఆడపడుచుల తాళిబొట్లు తెగిపోవడానికి వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వైసీపీ నాలుగు న్నారేండ్ల పాలనలో అవినీతి అరాచకాలు, దాడులు, హత్యలు తప్ప అభివృద్ధి సూన్యమన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకు రాకపోగా ఉన్న పరిశ్రమలను పార్రద్రోలి యువతకు, నిరుద్యోగుల జీవితాలను సర్వనాశనం చేశారన్నారు, టీడీపీ శ్రేనుల్లో ఉత్సాహం చూసిన తరువాత వైనాట్ పులివెందుల అంటూ కార్యకర్తల్లో మరింత జోష్‌ను నింపారు.తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాదును అభివృద్ధి చేశానని,ఇటి రంగాన్ని ప్రవేశపెట్టి ఎందరో నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించామన్నారు. సంపదను సృష్టించే పార్టీ తెలుగుదేశం పార్టీయేనని,నాకు డబ్బు సంపాదించే మార్గం రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో పరుగులెత్తించడం బాగా తెలుసన్నారు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు నాయుడు గ్యారంటీ అన్నారు.మహాశక్తి ద్వారా 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ.1500, తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతున్న ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15వేలు,దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలీండర్లు,ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు టికెట్లు లేని ప్రయాణ సౌకర్యం,అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తూ యువగళం పేరుతో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అందిస్తారని,బిసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వారికి అన్ని విధాల అండగా నిలుస్తూ పేదలను సంపన్నులను చేస్తూ ఐదేళ్ళలో పేదల ఆధాయాన్ని రెట్టింపుకు చంద్రబాబు గ్యారంటీ అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజ, గిరి, ఖాజా, కుట్టి, చిన్ని, సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, లోకేష్ ఆచారి, చంద్రశేఖర్, అడ్వకేట్ సుబ్బరామయ్య, నాయకులు ప్రసాద్‌నాయుడు, ఆనంద, చిట్టిబాబు, కె.చిన్నబ్బ, పరమశివ,సూరి,హరి, వసరాయగౌడు, దేవేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జయసింహా, ముబారక్‌తాజ్, వసరాయప్ప, జనసేన,బిజెపి నాయకులు పాటు పలమనేరు, వికోట, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## చేనేత కార్మికులకు ...
# 500యూనిట్ల దాకా ఉచిత విద్యుత్

**- రాష్ట్రంలో హత్యారాజకీయాలు పెరిగాయి - లక్షలు తీసుకున్న రోజాకు సిఎం జగన్ పెంచి పోషిస్తారా..? యువత భవిష్యత్తుకు నాంది పలుకుతా...కరెంట్ చార్జీలు పెంచేది లేదు - తెదేపా అధినేత చంద్రబాబునాయుడు**

పుత్తూరు, మార్చి 27 ప్రభాతవార్త : అధికారంలో రాగానే చేనేత కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బుధవారం పుత్తూరులో ప్రజాగళం బహిరంగసభలో చంద్రబాబు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో హత్యారాజకీయాలు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయా యన్నారు. రైతుల భూరికార్డులు మార్చే స్తున్నారని రైతుల పాసు పుస్తకాలపై సిఎం జగన్ ఫోటోలు వేయించుకోవడం దారుణమన్నారు. తమ భూములు కాపాడుకోలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వైకాపా పాలనలో దాపురించింద న్నారు. మరో పక్క నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచేశారన్నారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్, నూనె, ఉప్పు,పప్పు తదితరాల ధరలు ఆకాశాన్న ంటా యన్నారు. జబర్దస్త్ ఎమ్మెల్యే రోజా మహిళలకు అండగా ఉండాల్సింది పోయి విజయలక్ష్మి అనే మహిళ వద్ద మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం 40లక్షలు తీసుకున్నారని ఇలాంటి ఎమ్మెల్యేలను జగన్‌రెడ్డి పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు.



పుత్తూరు ప్రజాగళం బహిరంగసభలో ప్రసంగిస్తున్న

**యువత భవితకు నాంది పలుకుతా :**

తమ ప్రభుత్వం అధికారంలో రాగానే యువత భవితకు నాంది పలుకుతానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదేళ్లలో ఇరవై లక్షల ఉద్యోగాలు యువతకు కల్పిస్తామన్నారు. అలాగే ప్రతినెలా 3వేల వంతున నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో వర్క్‌స్టేషన్లు ప్రారంభించి యువతకు పనులు కల్పిస్తామన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో రాగానే 18-29 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ 1500లు అందిస్తామన్నారు. తల్లికి వందనం పేరిట చదివే ప్రతి పిల్లాడికి రూ 15వేలు, దీపం పథకంలో ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అన్నదాత పథకంలో రైతులకు ఏటా ఇరవై వేల సాయం అందిస్తామన్నారు. నిరుద్యోగ భృతి కింద మూడు వేలు ఇస్తామన్నారు. యాభై ఏళ్లు నిండిన బిసిలకు 4వేల పింఛను అందిస్తామన్నారు. కలలకు రెక్కలు పథకంలో ఆడపిల్లలకు నైపుణ్యం పెంచి వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. కూటమి అధికారంలో రాగానే గంజాయి, డ్రగ్స్‌ను వంద రోజుల్లో లేకుండా చేస్తామన్నారు. చేనేతలకు ప్రత్యేక పాలసీ తెస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి కార్పోరేషన్ ద్వారా రుణాలు అందించడం జరుగు తుందన్నారు. తాము అధికారంలో వస్తే కరెంట్ చార్జీలు పెంచమని ప్రకటించారు. మళ్లీ అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. జె బ్రాండ్ మద్యాన్ని తొలగిస్తామన్నారు. ఐవిఆర్ విధానంలో సర్వే ప్రకారం ప్రజలు మెచ్చిన భానుప్రకాష్‌కు సీటు ఇచ్చానని అతన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని చంద్రబాబు నాయుడు కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, జీవరత్ననాయుడు, ధనపాల్, యుగంధర్, మాధవుల నాయుడు, రవి, బాలాజీ, కోలాసుధ, జలకం సునీల్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుప్పంలో చంద్రబాబును ఓడిస్తాం

**- తెదేపాలో డబ్బున్న కోటీశ్వరులకే టికెట్లు ఇచ్చారు -చంద్రబాబు చెప్పేవి అబద్ధాలే - తండ్రీ కొడుకులకు ఇవే చివరి ఎన్నికలు -తెదేపా కనుమరుగు కావడం ఖాయం !! - చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప**



కుప్పంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబునాయుడును ఈసారి కుప్పంలో ఓడిస్తామని చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప పేర్కొన్నారు. బుధవారం కుప్పంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో డబ్బున్న మిలియనీర్లకే టికెట్లు ఇచ్చారని విమర్శించారు. చిత్తూరు జిల్లా ఎంపిగా బాపట్లకు చెందిన వ్యక్తిని తెచ్చి నిలబెట్టారన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు ఇవే చివరి ఎన్నికలు అని తెలుగుదేశం పార్టీ కనుమరుగు కావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఇప ్పటికే ఇంటెలిజెన్స్ నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు నాయుడు తెదేపా ఓడుతుందని, మరలా జగన్ సిఎం అవుతారని తెలుసుకుని అబద్ధాలు చెబుతున్నారన్నారు. కుట్రలు, కుతంత్రాలతోనే చంద్రబాబు జీవితం గడుపుతున్నారని వ్యాఖ్యలు చేశారు. అధికారంలో రాగానే మద్యం ధరలు తగ్గిస్తామన్న చంద్రబాబు తన వదిన, బిజెపి నాయకులతో చెప్పి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని పేర్కొన్నారు. బిజెపితో జత కట్టేందుకు ఐదేళ్ల పడిగాపులు కాశారని విమర్శించారు. బిజెపితో కలయిక సమసమాజ స్థాపనకు వ్యతిరేకమన్నారు. కుప్పంలో చంద్రబాబు ఇకపై దొంగ ఓట్లతో గెలవడం కుదరదన్నారు.కుప్పంలో ఈసారి ఎమ్మెల్సీ భరత్ గెలవడం ఖాయమన్నారు. కుప్పానికి చంద్రబాబు ఏం చేయలేదని, ఆయన తరపున కుప్పంలో ఓట్లు అడిగే వారు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. డెబ్బైశాతం మంది ప్రజలు తమతోనే ఉన్నారన్నారు. అప్పుడే తాను అధికారంలో వచ్చేసినట్లు ంద్రబాబు వాలంటీర్ల గురించి మాట్లాడడం సరికాదన్నారు. తాత్కాలిక రాజధాని అమరావతికి కోట్లు ఖరు ్చ చేశారన్నారు. సొంత సామాజికవర్గం కోసమే హైటెక్ సిటీని హైదరాబాదులో కట్టారని విమర్శించారు. తనకు ఓట్లేయకుంటే తమ భర్తలకు మహిళలు భోజనం పెట్టొద్దని చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ పద్నాలుగు ఏళ్ల సిఎంగా ఉన్న చంద్రబాబు కుప్పానికి నీళ్ల ఎందుకు తేలేదని ప్రశ్నించారు. మరలా అధికారంలో రాగానే కుప్పంలో రెండు చోట్ల రిజర్వాయర్లు నిర్మించడంతో పాటు హంద్రీ-నీవా జలాలు అందిస్తామన్నారు. కుప్పాన్ని బెస్ట్ టౌన్‌గా చేస్తామని పేర్కొన్నారని అంటే ఇంతకుముందు ఏమీ చేయలేదనే అర్థం అన్నారు. తాము కుప్పాన్ని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. చంద్రబాబుకు కుప్పంలో ఓటమి భయం పట్టుకుందన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, టెలికాంబోర్డు సభ్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.

# చంద్రబాబు ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటా!

**- విజయసాయిరెడ్డి,చెవిరెడ్డి, విజయానందరెడ్డిలు కటిక పేదలా! -ఎంపిరెడ్డెప్ప, భరత్‌లు నిజాలు మాట్లాడే సత్యహరిశ్చంద్రులా..? -కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీతో బాబు గెలుపు తథ్యం !! -ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు కుప్పంలో ఓడితే తాను రాజకీయాలనుంచి తప్పుకుంటానని అదే గెలిస్తే మీరు రాజకీయాలనుంచి తప్పుకునే దమ్ముందా అని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లకు సవాల్ విసిరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు కోటీశ్వరులకు టికెట్లు ఇచ్చారని ఎంపి రెడ్డెప్ప పేర్కొన్నారని విజయసాయిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విజయానందరెడ్డిలు కటిక పేదలా అని ప్రశ్నించారు. ఎం.పి. రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు నిజాలు మాట్లాడే సత్య హరిశ్చంద్రులా అని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజలకు చేసేవే చెబుతారన్నారు. చంద్రబాబునాయుడు రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి అన్నారు. కుప్పంలో ఈసారి లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. హంద్రీ-నీవా జలాలు తెచ్చానని సిఎం జగన్ కుప్పం ప్రజల్ని మోసం చేశారన్నారు. చంద్రబాబు కుప్పం ప్రజలకు అందుబాటులో ఉండరని చెబుతున్న వైఎస్సార్సీ నేతలు సిఎం జగన్ పులివెందుల ప్రజలకు అందుబాటులో ఉన్నారా అనే విషయం గుర్తించాలన్నారు. కుప్పం మున్సిపాలిటీకి మంజూరైన 60కోట్ల నిధులతో పనులే పూర్తి కాలేదన్నారు. కుప్పంలో వైఎస్సార్సీ నేతలు జబర్దస్త్ షోలు పెడుతున్నారన్నారు. కుప్పంలో వైఎస్సార్సీకి ఓట్లేసిన ప్రజల గుండెల్లో సైతం చంద్రబాబు ఉన్నారన్నారు. ఎన్టీఆర్ సుజల నీటికి స్టిక్కర్లు అతికించుకున్నారన్నారు. ఎవరికో పుట్టిన బిడ్డ నాబిడ్డ అనే రీతిలో తాము గతంలో అభివృద్ధి చేసిన పనులు, భవనాలకు వైఎస్సార్సీ నేతలు రంగులేసుకుని ప్రారంభించుకుని గొప్పగా చెప్పడం దారుణమన్నారు. కుప్పంలో చంద్రబాబు ఏం చేశారనేందుకు ఇక్కడ ఉన్న శిలాఫలకాలే జవాబు చెబుతాయని ఇందుకు వైఎస్సార్సీ నేతలు సిద్ధమా అని ప్రశ్నించారు. కుప్పం ప్రజలు కూడా రాష్ట్ర భవిష్యత్తు మార్చే వ్యక్తి చంద్రబాబేఅని విశ్వసిస్తున్నారన్నారు. ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం , మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ కుప్పం అభివృద్ధి చంద్రబాబు చలవేనని ఎవర్ని అడిగినా చెబుతారన్నారు. స్కూళ్లు, ఆస్పత్రులు, కాలేజీలు, గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. కుప్పం సమావేశంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, రాష్ట్ర నేతలు జిఎం రాజు,పార్థసారథి, తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ, మహిళా నేతలు సుగుణమ్మ, వసంతమ్మ పాల్గొన్నారు.

# నీ భవిష్యత్తుకు నేను గ్యారంటీ

**-నాలుగు నియోజవర్గాల్లో గెలుపు బాధ్యత మీదే -ఎస్సీవీకి స్పష్టం చేసిన చంద్రబాబు**



చంద్రబాబునాయుడుతో ఎస్సీవీనాయుడు, మునిరామయ్యలు

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు అనివార్యకారణాల వల్ల ఇవ్వ లేకపోయా.. అంతకన్నా ఎక్కువ భాధ్యతను మీరు తీసుకుని పార్టీని విజయపథంలో నడపాలని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ నాయుడుకు స్పష్టం చేశారు. జిల్లాల పర్యటనలో బిజీబిజీగా ఉన్న చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం ప్రజాగళం యాత్రలో భాగంగా కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు నాయుడు పర్యటించారు. శ్రీకాళహస్తి పార్టీనాయకుల్లో చోటుచేసుకున్న అసంతృప్తిపై మాజీ ఎంఎల్ఏలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ ముని రామయ్యలతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్సీవీతో మాట్లాడుతూ నీ భవిష్యత్తు గ్యారెంటీ నాది. మన పార్టీ అధికారంలోకి వస్తుందని నీకు సముచిత స్థానం గుర్తింపు ఉంటుందని వివరించినట్లు తెలిసింది. మీ ప్రాధాన్యత గురించి ఈనెల 30న శ్రీకాళహస్తిలో జరిగే రోడ్‌షోలో ప్రకటిస్తానని చంద్రబాబు స్పష్టం చేసినట్లు సమాచారం. ఎస్సీవీనాయుడు భుజస్కంధాలపై శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థుల గెలుపుకు నడుంబిగించాలని స్పష్టం చేశారు. మాజీ ఎంఎల్ఏలు ఎస్సీవీనాయుడు, ఎస్సీవీ దిలీప్, మునిరామయ్యలులు చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రధానంగా తిరుపతి పార్లమెంటు స్థానంలోని శాసనసభ నియోజక వర్గాల రాజకీయ పరిస్థితులు ఈబేటీలో చర్చకు వచ్చాయి. ఇరువురు మాజీ ఎంఎల్ఏలు ఎట్టి దాపరికం లేకుండా నియోజకవర్గాలోని పరిస్థితులు చంద్రబాబునాయుడుకు స్పష్టంగా వివరించారు. వీరి వాదనతో చంద్రబాబునాయుడు కూడఆ ఏకీభవించినట్లు తెలిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీలో పదిరోజులుగా సాగిన ఉత్కంఠతకు చంద్రబాబునాయుడు తెరవేశారు. శ్రీకాళహస్తి బహిరంగసభలో పబ్లిక్‌గా చంద్రబాబునాయుడు ఏంచెబుతారన్నది పార్టీ వర్గాల్లో ఉత్కంఠత చోటుచేసుకుంది.

## సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను...
# ఎప్పటికప్పుడు నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలి

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా -నోడల్ అధికారులు ఎన్నికల ఫిర్యాదులకు సంబంధించిన రిపోర్టులు సకాలంలో సంబంధిత అధికారులకు అందేలా చూడాలి : జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర**



తిరుపతి కార్పొరేషన్, మార్చి 27 ప్రభాతవార్త : సి-విజిల్ యాప్, ఈఎస్ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసిఎంసి ఫిర్యాదుల పరిష్కారం, సన్నద్ధత, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర సచివాల యం సిఈఓ కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో సార్వత్రిక ఎన్నికలు 2024 సన్నద్ధ తకు సంబంధించిన పలు అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో బుధవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎం సంబంధిత నోడల్ అధికారులతో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు గడువులోపు పరిష్కరించేలా చూడాలని తెలిపారు. ఎన్నికల ప్రచారం కొరకు వాడే వాహనాలు, ర్యాలీల అనుమతుల కొరకు సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు సువిధా యాప్ నందు దరఖాస్తు చేసుకోవాలని, అందిన సదరు దరఖాస్తులను ఎన్‌కోర్ యాప్ ద్వారా సంబంధిత వివిధ విభాగాల నోడల్ అధికారులు పరిశీలించి అవసరమైన అనుమతులకు చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్ తదితరాలపై చెక్ పోస్టులు, స్టాటిక్ సర్వైవలెన్స్ టీంలు, సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనం తరం జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారులతో సమావేశమై ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల విధులకు నియమించిన నోడల్ అధికారులందరూ సమన్వయంతో వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులకు సంబంధించిన రిపోర్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో సంబంధిత అధికారులకు పంపేలా చూడాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా నోడల్ అధికారులు అందరూ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు డిఆర్ఓ పెంచల కిషోర్, సంబంధిత నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దళారుల జోక్యం.. ధరల్లో మాయాజాలం

కోట, మార్చి 27 ప్రభాతవార్త :

ఓ వైపు వరికోతలు, నూర్పిళ్ల ముమ్మరంగా సాగుతుండగా.. ఇంకోవైపు ధాన్యం ధరలు తగ్గుముఖం పట్టడంపై అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నెల ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్న ధరలు ఇప్పుడు నేలచూపులు చూస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, మిల్లర్ల మాయాజాలమే కారణమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కోట మండలంలో బిపిటి పుట్టి ధాన్యం రూ.23 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.21 వేలు ధర పలుకుతోంది. ఈ నెలాఖరుకు మరింత తగ్గే ప్రమాదం ఉందన్న ప్రచారంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు తక్కువగా ఉండగా, ధాన్యం ధరలు దిగజారేందుకు దళారులు, మిల్లర్లే కారణమని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ధరలు రోజురోజుకు పెరుగుతుంటే ధాన్యం ధరలు తగ్గడంపై ఆవేదన వ్యక్తమవుతోంది. అధికారులు చర్యలు చేపట్టి అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

## కాణిపాకం ఆలయానికి 78.39 లక్షలు ఆదాయం

కాణిపాకం, మార్చి 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 78.39 లక్షలు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 14 రోజులకు గాను హుండీల ద్వారా 78,39,038 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 14 గ్రాముల బంగారు, 910 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 5,409 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 20,190 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 1066 అమెరికా డాలర్లు, 15 ఇంగ్లాండ్ ఫౌండ్స్,50 ఆస్ట్రేలియా డాలర్లు, 1 మలేసియా రింగిట్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో డీవైఈఓ వాణి,ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు,విద్యాసాగర్‌రెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధగిరి హుండీల ద్వారా 14.79 లక్షలు ఆదాయం

తవణంపల్లె, మార్చి 27 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 14.79 లక్షలు రూపా యలు ఆదాయంగా లభించింది. బుధవారం ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యం లో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా 108 రోజులకు గాను 14,79,624 రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుమనప్రియ, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆఫీసర్ సాయిలోచన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బందితో పాటు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరిక

శాంతిపురం, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని కోనేరుకుప్పం పంచా యతీకి చెందిన పలువురు తెదేపా కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరారు. సత్యనారాయణ, నవీన్‌కు మార్, సాకుల వెంకటరామప్ప, హసేన్, బషీర్‌సాబ్, లోకేష్ తదితరులు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ భరత్ పార్టీ కండువాలు కప్పి సాదర ంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసు ంధర కోదండరెడ్డి, రవి పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్సీ భరత్ గుంజార్లపల్లిలో ప్రచారం చేపట్టారు.

## ఎంపి రెడ్డెప్ప సమక్షంలో వైకాపాలో చేరికలు

రామకుప్పం, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని రెడ్డివారిపల్లి, చింతమా నత్తం, సింగసముద్రం గ్రామాలనుంచి తెదేపా కార్యకర్తలు పలువురు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని వైకాపాను మరలా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపిసుబ్రమణ్యం, కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, మంజునాథరెడ్డి, చలపతి పాల్గొన్నారు.

## తాహసీల్దార్ కార్యాలయంపై ఎసిబి దాడులు

కార్వేటినగరం,మార్చి 27 ప్రభాతవార్త:



కార్వేటినగరం తాహసీల్దార్ కార్యాలయంపై బుధవారం ఎసిబి దాడులు నిర్వహించారు. తాహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అధికారులు మామూళ్ళు ఇవ్వకుంటే పనులు జరగడం లేదని సమాచారం. పేద,ధనిక తారతమ్యం లేకుండా నిర్లక్ష్యంగా ముక్కుపిండి వసూలు చేస్తుండడంతో అందిన సమాచారం మేరకు ఎసిబి అధికారులు రెవిన్యూ కార్యాలయంపై దాడులు నిర్వహించి నగదు తీసుకుంటున్న ఆర్ఐ రెడ్డెప్పను పట్టుకున్నారు. దీంతో రెవిన్యూ కార్యాలయ సిబ్బంది ఉలిక్కి పడినట్ల య్యింది. ఈ విషయంపై స్థానికులు కార్యాలయంలో ఇంకా కొందరు వసూ ళ్ళరాయుళ్ళు ఉన్నారని వారిపై కూడా ఎసిబి అధికారులు నిఘా వుంచి పట్టు కున్నట్లయితేప్రజలకున్యాయంజరిగినట్లవుతుందనిపలువురు కోరుతున్నారు.

## పింఛన్లు పంపిణీపై వాలంటీర్లకు కీలక ఆదేశాలు

కోట, మార్చి 27 ప్రభాతవార్త :

ఏప్రిల్, మే నెలల పింఛన్లు పంపిణీకి వాలంటీర్లు ఆథరైజేషన్ పత్రాలు తీసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (స్పెర్) సర్కులర్ జారీ చేసింది. ఎన్నికల కోడల్ దృష్ట్యా బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల వద్ద ఆథరైజేషన్ పత్రం తప్పనిసరి అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంపిడిఓలు సంక్షేమ కార్యదర్శులకు ఆథరైజేషన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. పింఛన్ పంపిణీ సమయంలో వాలంటీర్లు ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని పేర్కొన్నారు. పంపిణీ చేసినట్లుగా ఫొటోలు, వీడియోలు తీయవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు తేలితే వాలంటీర్లపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకం ఎస్ఐకు ప్రతిష్టాత్మక అవార్డు

కాణిపాకం, మార్చి 27 ప్రభాతవార్త:



విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభకనబరచిన కాణిపాకం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామ్మోహన్‌కు పోలీసు శాఖ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించింది. 2022లో కొత్తకోట ఎస్ఐగా పని చేసిన రామ్మోహన్ కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి అరికట్టడంతో పాటు రెండు హత్య కేసులను చాకచక్యంగా చేదించి నీతి నిజాయితీగా తన విధులను నిర్వర్తించడంతోరాష్ట్ర డీజీపీ ఎస్ఐ రామ్మోహన్‌కు ప్రతిష్టాత్మకమైన డీజీపీ కామేడేషన్ డెస్క్ అవార్డు బ్రేజ్ మెడల్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డును తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. అలాగే అవార్డు ప్రకటించడంతో ఎస్ఐలు, పలువురు అభినందించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి

– పూతలపట్టు ఎన్నికల అధికారికి ఫిర్యాదు

కాణిపాకం, మార్చి 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థా నం ఈవో ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆలయ జనసేన నాయకులు రాజకుమార్ బీజేపీ నాయకులతో కలసి బుధవారం పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దేవస్థానం వద్ద రాజకీయ నాయకుల ఫోటోలు ఉన్న బుక్కులేట్లను భక్తులకు పంచుతున్నారు. భక్తులకు పంచుతున్నారన్న ఆరోపణలపై ఈవో ఇచ్చిన వివరణ పూర్తిగా వాస్తవ దూరమని పేర్కొన్నారు. డొనేషన్ కౌంటర్లు భక్తులకు ఈ బుక్‌లెట్లను అందజేశారా...లేదా... అనే విషయమై సీసీ ఫేటేజ్‌లను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అలాగే తప్పుడు వివరణ చేసినట్లయితే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలెక్షన్ కమిషన్ ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్రం తదితరులు పాల్గొన్నారు.

## కుప్పాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తాం..ఆదరించండి

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పంరూరల్, మార్చి 27 ప్రభాతవార్త



కుప్పాన్ని ఆదర్శవం తంగా అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆ ద ర ి ం చా ల ని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొ న్నారు. బుధవారం కుప్పం పట్టణం లోని 18,19వార్డుల్లో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కుప్పం మున్సిపా లిటీలో 66కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా సిఎం జగనన్న ప్రతి కుటుంబానికి ఏదో ఓ పథకంలో లబ్ది కలిగించారన్నారు. కుప్పం నియోజకవర్గంలోనే సంక్షేమ పథకాల కింద 1400కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వార్డు,గ్రామ సచివాలయాలతో పరిపాలన ప్రజల వద్దకే తెచ్చిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీ భరత్‌ను, చిత్తూరు ఎంపిగా రెడ్డెప్పను ప్రజలు గెలిపించాలని కోరారు. కుప్పం అభివృద్ధి బాధ్యత తమదేనన్నారు. కార్యక్రమంలోబిల్డింగ్ సొసైటీ ఛైర్మన్ అబ్బాస్, నేతలు అవినాష్, నవాజ్. పాపు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

గూడూరు, మార్చి 27 ప్రభాతవార్త :




గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియం వద్ద రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుల భరోసా కింద దివ్యాంగులకు నిత్యావ సర వస్తువులు క్లబ్ ప్రతినిధులు అందజేసారు. ఈ కార్యక్రమానికి దాతగా శకుంతలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఎల్ఎపి ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ప్రతినెలా చేయూత అందిస్తున్నామన్నారు. ఇందుకు దాతలు సహకరిస్తున్నారని వారికి కృతజ్ఞతులు చెప్పుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసిపిని ఆశీర్వదించండి : మేరిగ మురళీధర్

గూడూరు, మార్చి 27 ప్రభాతవార్త :



గూడూరు పట్టణంలోని సనత్ నగర్ తదితర ప్రాంతాల్లో వైకాపా ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. స్థానికులు మేరిగ మురళీధర్‌కు ఘన స్వాగతం పలికారు. వైకాపా హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సమావేశంలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి సమర్థవంతంగా అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, నాగులు, సురేష్ రెడ్డి, గిరిబాబు, కోదండరామయ్య, సాయి, హాషిమ్, పూర్ణ, అశోక్, బాలు, అల్తాఫ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## కారు స్కూటరిస్ట్ ఢీ...ఒకరు మృతి

గూడూరు, మార్చి 27 ప్రభాతవార్త :



గూడూరు మండల పరిధిలోని తిరువెంగలాయపల్లి గ్రామ సమీపంలో కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ కథనం మేరకు బాలాయపల్లి మండలం నిడలి గ్రామానికి చెందిన పల్లేపు వెంకటాద్రి (28) పనులు నిమిత్తం గూడూరు నుండి నిడలి వెళ్తుండగా అదే దగ్గర స్కూటర్‌నీ ఢీకొనడంతో స్కూటరిస్ట్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : లక్ష్మీ సాయి ప్రియ

వెంకటగిరి టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి తప్పు చేసామని ప్రజలు తనతో చెప్పి బాధపడుతున్నట్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ తెలిపారు. వెంకటగిరి పట్టణం మూడో వార్డు బీసీ కాలనీలో ఆమె బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. చేనేత కార్మికులు అధునాతన పద్దతులు పాటించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రచారం చేస్తుండడం ఆనందంగా ఉందన్నారు. పదవ వార్డు మలులాలపేటలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ నిర్వహించారు. అన్ని కులాల వారికి టిడిపిలోనే ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సత్యనారాయణ, గంగాధర్, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నేదురుమల్లితో భేటి అయిన వేనాటి రామచంద్రారెడ్డి

వెంకటగిరి టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :



నేదురుమల్లి నివాసంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సూళ్ళూరుపేట నియోజక వర్గ వైసిపి నాయకులు వేనాటి రామచంద్ర రెడ్డి భేటీఅయ్యారు. శాలువా కప్పి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇరువురు పలు అంశాల గురించి చర్చించుకున్నారు.

## ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్ధిని లక్ష్మిసాయి

బాలాయపల్లి, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని కురుగొండ్ల లక్ష్మి సాయి ప్రియ ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేసి టిడిపి అమలు చేయనున్న పథకాలను వివరించారు. తెలుగు ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ తానంకి నానాజీ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యం నాయుడు సివికే నాయుడు, ఎడపల్లి కోటేశ్వర రావు, శ్రీనివాస్ రెడ్డి, గోపి, కోటి, ప్రసాద్ నాయుడు, వెంకటేశ్వర గౌడ్, చక్రాల ఉష పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రక్టర్ పట్టివేత

బాలాయపల్లి, మార్చి 27 ప్రభాతవార్త :



వెంకటగిరి – గూడూరు మార్గం మధ్యలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రక్టర్‌ను బాలాయపల్లి ఎస్ఐ మహబూబ్ సుభాని పట్టుకొని ఇసుక ట్రాక్టర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకుని స్టేషన్‌లో పెట్టారు.

## సచివాలయాల తనిఖీ

కోట, మార్చి 27 ప్రభాతవార్త :



కోట మండలంలోని గూడలి-1, గూడలి-2, చంద్రశేఖరపురం గ్రామాల్లోని సచివాలయాలను బుధవారం ఎంపిడిఓ శంకరయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లోని పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో పంచాయతీ పరిధిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును కూడా పరిశీలించారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే : ఎంపిడిఓ



చిట్టమూరు, మార్చి 27 ప్రభాతవార్త :

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమ నిబంధనలు పాటించాల్సిం దే అని చిట్టమూరు ఎంపి డిఓ నాగరాజ అధికారులను సూచించారు. బుధవారం ఆయన చిట్టమూరు మండం లోని ఎల్లసిరి, హిస్టోల్ సెంటర్, జంగాలపల్లి, అద్దెపూడి, కోతలగుంట, అరవపాలెం గ్రామాల్లో ఎంసీసీ టీమ్‌తో కలిసి పరనయటించారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎకనకడా కూడా శిలాఫలకాలపైన పేర్లు కనిపించే విధంగా ఉండకూడదని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో కట్టించిన బస్సు షెల్టర్లపైన పేర్లు సైతం కనిపించకుండా చేయాలన్నారు. అలాగే హైస్కూలు, ఎంపీపీ స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ప్రభుత్వానికి సంబంధించిన అడ్వర్‌టైజ్‌మెంట్లు కనిపించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచనలిస్తూ పర్యటించారు.

## గుడ్‌ఫ్రైడేకి ర్యాలీలు నిషేదం - ఎంపీడీవో

కోట, మార్చి 27 ప్రభాతవార్త :

ఈ నెల 29న గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలో ఎవరైనా పాస్టర్లు ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ శంకరయ్య హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడల్ అమలులో ఉన్నందున చర్చిలకు సంబంధించిన పాస్టర్లు గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని ర్యాలీలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఒకవేళ ర్యాలీలు చేయాలనుకుంటే ఎన్నికల అధికారి వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. వేసవి నేపథ్యంలో ఆయా పంచాయతీల్లో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి వనరులను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలన పిఆర్ డిఈ

వాకాడు, మార్చి 27 ప్రభాతవార్త :



వాకాడు మండలంలోని కొడివాక గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఉండడంతో గురువారం పంచాయితీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ నంద దయాల్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పంచాయితీ రాజ్ శాఖ జిల్లా నోడల్ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో కనీస వసతులు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అన్నారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయుడు నూతనపాటి వెంకట రమణయ్య, పంచాయితీరాజ్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు
-బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త :



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తారని ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించేది ఒక్క తెలుగుదేశంపార్టీనే అని దివంగత నేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని క్లస్టర్ నంబర్.3 పరిధిలో పట్టణ అధ్యక్షుడు మరియు క్లస్టర్ఇన్ఛార్జి విజయకుమార్ ఆధ్వర్యంలో మహిళలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా బొజ్జలబృందమ్మ, బొజ్జలరిషితారెడ్డిలు హజరై తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వారికి వివరిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటిపన్నులు, విద్యుత్ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని తెలిపారు. నేడు రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల పాలనకు చరగీతం పాడేరోజులు దగ్గర్లోనే ఉన్నాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా, నియోజకవర్గంలో బొజ్జలసుధీర్రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. అనంతరం బృందమ్మ, రిషితారెడ్డిలను పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, యూనిట్ ఇన్ఛార్జులు అద్దంకి హేమంత్కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రంకిషోర్, బూత్ ఇన్ఛార్జులు మీర్జా, బాబురెడ్డి, సురేష్, మీర్జా, గురవయ్య, తెదేపా నాయకులు, కార్యకర్తలుతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఇన్ఛార్జిగా వినుత

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త :



రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల ఇన్ఛార్జిలు నియామకంలో భాగంగా మొట్టమొదటి సారిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్ఛార్జి వినుత కోటను కొనసాగిస్తూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్కళ్యాణ్ నియామకపత్రాన్ని బుధవారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో వినుతకు అందించి అభినందించారు.

## అందుబాటులో ఉండే ఎంఎల్ఏను మరోసారి గెలిపించండి
-బియ్యపు పవిత్రారెడ్డి



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 27 ప్రభాతవార్త :

పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు, అందుబాటులో ఉన్న తన తండ్రి బియ్యపుమధుసూధన్రెడ్డిని, రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి పార్టీని మరోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్రెడ్డి కుమార్తె బియ్యపుపవిత్రారెడ్డి తెలిపారు. అభివృద్ధి కావాలా..అందుబాటులో లేని వారు కావాలా అన్న నినాదంతో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పంచాయతీలోని ముచ్చివోలు పంచాయతీలో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్దిపొందిన వారితో మమేకమవుతూ తాము గెలిచినప్పటి నుంచి అనునిత్యం ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలచిన ఒకే ఒక వ్యక్తి తన భర్త బియ్యపుమధుసూధన్రెడ్డి ఒక్కరే అన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్న సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా కనిపించకుండా పోయిన వారందరు నేడు అందరిపై అబద్దపు ప్రేమను చూపిస్తూ మోసం చేయాలని చూస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని తెలిపారు. వితంతువులకు, వృద్దులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఫించన్లు పెంచిన ఘనత ఒక్క సిఎం జగన్మోహన్రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వయ్యాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి భానుమూర్తి యాదవ్, సర్పంచ్ నరసింహారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గురునాధంరెడ్డి, వయ్యాలమనోహర్రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సురేష్, కూనాటి గురునాధం, అమర్నాధరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన

తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త :



మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఓ మరియు సెక్టోరియల్ అధికారిగా వ్యవహరిస్తున్న ఈవోపిఆర్ అండ్ ఆర్డిలు సంయుక్తంగా పరిశీలించారు. కొత్తకండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో ఓటర్లకు తగిన వసతులు ఉండేవిధంగా పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు మరియు సచివాలయ సిబ్బంది ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తహశీల్దార్, ఎంపిడిఓ, ఆర్ఓల దృష్టికి తీసుకురవాలన్నారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవాలన్నా పోస్టర్లు తదితరాలు ఏర్పాటుకు రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనధికారికంగా ఏర్పాటుచేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు మొదలైనవి వేసినా వాటిని తొలగించి చట్టపరమైన చర్యలుతీసుకుంటామన్నారు.

## బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేది తెదేపానే
-బిసిల ఆత్మీయ సభలో రిషితారెడ్డి



తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త

మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామంలో బుధవారం నియోజకవర్గ ఇన్ఛార్జి బొజ్జల సుధీర్రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి సమక్షంలో బిసిల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అని తెలిపారు. తెలుగుదేశంప్రభుత్వ హయాంలో బిసి కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారికి అవసరమైన వస్తువులను సబ్సిడీలో ఇచ్చేవారని అంతేకాకుండా రైతులను ఆదుకున్న ఘనత కూడా నారా చంద్రబాబునాయుడుదే అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో నారాచంద్రబాబునాయుడును, నియోజకవర్గంలో బొజ్జల సుధీర్రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ఛార్జి మునిరాజనాయుడు, మండల బిసి అధ్యక్షులు సురేంద్రయాదవ్, మాజీ జడ్పీటిసి వెంకటాచలం, రేణుకమ్మ, చలపతి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్‌లో సెవెన్ హిల్స్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రాపురం, మార్చి 27 ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ పోటీలలో వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి అవార్డులు సొంతం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన మొదటి స్టేట్ లెవెల్ కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహించారన్నారు. ఇందులో మౌఖిత ప్రదర్శన విభాగంలో ప్రకృతి-2 టీమ్ ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. పోస్టర్ ప్రెంజెంటేషన్ విభాగంలో బి ఫార్మశీ విద్యార్థులు హర్షిత, తదితరులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. ఉత్తమ బహుమతులుఅందుకున్న విద్యార్థులను కరస్పాండెంట్ సుమలత, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## మూడు పార్టీల కూటమికే మా మద్దతు
-కాపునేడు నేతల వెల్లడి

తిరుపతి హెల్త్, మార్చి 27 ప్రభాతవార్త :



కాపులకు గత ఐదేళ్లుగా సరైన న్యాయం జరగక పోవడాన్ని జీర్ణించుకోలేని తిరుపతి చిత్తూరు జిల్లాలోని కాపు నాయకులంతా 2024 ఎన్నికలలో టిడిపి, బిజేపి, జనసేన పార్టీల పొత్తు కూటమికి మద్దతు తెలుపుతున్నట్లు కాపునాడు నేతలు సరిత నాగరాజ్, గుట్ట నాగరాజు రాయల్ తదితరులు వెల్లడించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ గత టిడిపి పాలనలో జరిగిన న్యాయం వైసిపి పాలనలో కాపులకు జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాలలో మూడు పార్టీల పొత్తు గెలుపుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## గతం కన్నా వైసిపిలో బీసీలకే ఎక్కువ సీట్లు కేటాయించారు
-అన్నా రామచంద్రయ్య ఆరోపణలపై స్పందించిన తిరుపతి మేయర్ శిరీష

తిరుపతి హెల్త్, మార్చి 27, ప్రభాతవార్త :



ప్రముఖ పార్టీల కన్నా వైసిపిలో బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుందని, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష కొనియాడారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఉదయం అన్నా రామచంద్రయ్య వైసిపికి రాజీనామా చేస్తూ మాట్లాడిన విషయంపై స్పందించి అదే ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ శిరీష మాట్లాడుతూ వైసిపిలో ఇమడలేని అన్నా రామచంద్రయ్య బీసీలకు నష్టం జరిగిందని విమర్శించడంలో నిజం లేదన్నారు. ఐదుఏళ్ల కాలంలో వైసిపిలో జరుగుతున్న ప్రజాసేవ, సంక్షేమ పథకాల పంపిణీలను నెరవేర్చడంలో జనానికి న్యాయం జరుగుతున్నదని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలోతాతయ్యగుంట గుడి ఛైర్మన్ కట్ట గోపి యాదవ్, తులసి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు పూజలు-నాయకుల జాతర
-మొక్కులు తీర్చుకున్న మహిళలు

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 27 ప్రభాతవార్త :



ఎన్నికల సీజన్‌వచ్చేసింది. ఎక్కడ వివాహాలు జరిగినా శుభకార్యాలు జరిగినా కుటుంబంలో ఇబ్బందులు ఏర్పడినా పిలిచినా పిలవకపోయినా నాయకులు హజరవుతున్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా ఆప్యాయంగా పలకరిస్తున్నారు. కౌగిలించుకుంటున్నారు, మంచిచెడ్డలు విచారిస్తున్నారు. దాంతో జనం అబ్బో.. ఎన్నికలు వచ్చేశాయంటూ చర్చించు కుంటున్నారు. ఈనేపథ్యంలోనే బుధవారం శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామంలో వెలసిన పోలేరమ్మ జాతరలో రాజకీయ సందడి చోటుచేసుకుంది. ఇటు తెలుగుదేశం అటు వైకాపా మరోవైపు బిజెపి, ఇంకోవైపు జనసేన పోటీలు పడి హజరై గంగమ్మకు మొక్కులు ప్రజలకు పలకరింపులతో ఆకట్టుకున్నారు. అమ్మవారి జాతర సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా గ్రామస్తులు సారెసమర్పణకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారికి సారెను సమర్పించడం తన అదృష్టమన్నారు. గ్రామాల్లో జాతరలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరు సంతోషంగా ఉండాలని కోరుకున్నామని తెలిపారు. కాగా పలువురు మహిళా భక్తులు అమ్మవారికి అంబళ్ళుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘునాయుడు, అనంతరాయల్, శశిరాయల్, నరసింహులురెడ్డి, మునిరాజయాదవ్, శివరాయల్ రామురెడ్డి, శివయ్య, రాజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ కుటుంబసమేతంగా విచ్చే శారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వి.నాగేశ్వరరావు మరియు ఆలయాధి కారులు స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకదర్శనంతో పాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని దక్షిణామూర్తి వద్ద ఈవో ఎస్వి.నాగేశ్వరరావు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించి శేషవస్త్రాలతో సత్కరించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఎఈవో సతీష్‌మాలిక్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు పారంభం

తిరుపతి క్రీడ, మార్చి 27 ప్రభాతవార్త :



శ్రీ శ్రీనివాసా క్రీడా సముదాయములో రాష్ట్ర 67వ ఎస్‌జిఎఫ్ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్ 11 సంవత్సరాలు, అండర్ 14 సంవత్సరాలు పోటీలు, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికలు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెక్రటరి భానుమూర్తి రాజు, అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరి పి. విజయకుమార్, డిఎస్‌డిఓ సయ్యద్, అబ్జర్వర్స్ శ్రీమన్నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, పిడిలు పాల్గొన్నారు. ప్రేమ్‌నాథ్, కర్ణం గంగాధర్, పురుషోత్తం, బాబ్జి, ప్రసాద్, శశి, రాజేష్, మధు, ప్రతాప్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాల నుండి బాలబాలికలు 209 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు పి. విజయకుమార్, ఎస్. జయరామయ్య తెలిపారు.

## మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకుందాం!

రేణిగుంట, మార్చి 27 ప్రభాతవార్త:



ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుని నియో జకవర్గాన్ని అభివృద్ధి చేసుకుం దామని మధుసూదన్‌రెడ్డి సతీ మణి శ్రీ వానిరెడ్డి పిలుపు నిచ్చారు. రేణిగుంట మండలం ఎస్‌యూ పురం కృష్ణాపురం నుంచి బుధ వారం సాయంత్రం మధుసూ దన్‌రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి శ్రీవాణిరెడ్డి మేము సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి చేయబోతున్న అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకుని జగన్ ముఖ్యమంత్రినఇ చేయాలన్నారు. ప్రతి గడప వద్ద ప్రజలు ఆమెను సాధారనంగా ఆహ్వానించి స్వాగతంపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు డా. గంగారి రమేష్, పార్టీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ ఆనందరావు, స్థానిక సర్పంచ్ ముద్దరాయులు, యువజన నాయకులు సందీప్‌రెడ్డి, రేణిగుంట సర్పంచ్ నాగేషం, కో-ఆప్షన్ సభ్యులు అసన్, తదితరులు పాల్గొన్నారు.

## సింహం లాంటి మనిషి దూరం కావడం బాధాకరం : మంత్రి రోజా

నగరి, మార్చి 27 ప్రభాతవార్త:



సింహం లాంటి మనిషి మాజీ జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం(పళణి) అని అలాంటి మనిషి మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి రోజా అన్నారు. బుధవారం నగరి మండల రూరల్ పరిధిలోని తడుకుపేట దళితవాడకు చెందిన మాజీ జడ్పీటీసీ పళణి అనారోగ్యంతో మృతి చెందాడు. పళణి మృతికి ఘన నివాళులర్పించిన రోజా కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ పళణి కుమారుడు ప్రస్తుత జడ్పీటీసీ గాంధీకి రాజకీయంగాను, కుటుంబ సభ్యులుగా అండగాను ఉంటానని తెలియజేశారు. వేలాది ప్రజలు తరలివచ్చి పళణికి నివాళులర్పించడం చూస్తుంటే గొప్ప ప్రజా నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు
-97 రోజులు రూ.5.68 లక్షలు

చంద్రగిరి, మార్చి 27 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ తిరుపతి, ప్రాంతీయ సంయుక్త కమీషనర్ వారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ టి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు వెళ్ళడించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ పాలక మండలి, సిబ్బంది సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. 2023 డిశంబర్ 20 నుండి 2024 మార్చి 27 వరకు 97 రోజులకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన నగదు కానుకలు రూ.5,68,903/-లు వచ్చినట్లు తెలిపారు.

## ఎన్నికల కోడ్‌తో వేలం వాయిదా

చంద్రగిరి, మార్చి 27 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామ పంచాయతీ నందు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున వేలములను వాయిదావేసినట్లు పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఈఓ మహేశ్వరయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపధ్యంలో వేలములు నిర్వహించడానికి తిరుపతి జిల్లా రిటర్నింగ్ అధికారి వారి అనుమతి ఉత్తర్వులు అవసరమైనందున గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించవలసిన బహిరంగ వేలములను వాయిదావేసినట్లు పేర్కొన్నారు. జిల్లా రిటర్నింగ్ అధికారి అనుమతి ఉత్తర్వులు పొందిన వెంటనే తేదీ తెలియపరచగలమని పేర్కొన్నారు.

## కళాకారులకు ఘనసన్మానం

తిరుపతి,మార్చి 27ప్రభాతవార్త:



ప్రపంచరంగస్థలి దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కళాకారులు వెంకటయ్య ,కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అనేక మంది కళాకారులు రంగస్థలం వేదికగా ప్రదర్శనలిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారన్నారు. అనేకమంది సినీరాజకీయ ప్రముఖులు ఒకనాడు రంగస్థల కళాకా రులుగా రాణించిన వారేనన్నారు. ఎంతోమంది కళాకారులు నేటికీ రంగస్థలంపై ఆసక్తిచూపుతుండటం సంతోషకరమాన్నరు. ప్రపంచ రంగస్థలం దినోత్సవం సందర్భంగా కళలకు ప్రాణంపోసిన కళాకారులను ఈ సందర్భంగా సత్కరించడం ఆనందంగా ఉందన్నారు గుండాల గోపీనాధరెడ్డి . ఈ కార్యక్రమంలో కళాకారులు కెవన్ రాజ, కేశవులు, కొత్తపల్లి శంకరయ్య, సురేష్‌స్వామి, సుబ్రమణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకర్షణీయమైన రిలయన్స్ ప్రారంభోత్సవ ఆఫర్

తిరుపతి,మార్చి27 ప్రభాతవార్త:

వేగంగా వృద్ధిచెందుతున్న రిలయన్స్‌ట్రెండ్స్ తిరుపతి పట్టణవాసులకు చేరువలో నూతన స్టోర్‌ను కరకంబాడిరోడ్డులో ప్రారంభించింది. అప్పారెల్ , ఫుట్‌వేర్, యాక్సెసరీస్,ప్రత్యేక చైన్స్, అత్యాధునికత, నాణ్యతను మేళవించి ఆకర్షణీయమైన దుస్తులతో కరకంబాడీ మార్గంలో సువిశాల విస్తీర్ణంలో ప్రారంభించిది. ఆకర్షణీయమైన ప్రారంభోత్సవ ఆఫర్ కింద 3999 షాపింగ్ చేస్తే 249 రూపాయల ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చు. నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉంది. ప్రత్యేకమైన ప్రారంభోత్సవ ఆఫర్‌గా 3,999 షాపింగ్ చేస్తే 249 రూపాయలు ఆకర్షణీయ బహుమతి అందుకోవచ్చు.

**CHANGE OF NAME**

I,**Cheekati Mahavishnu,** (old Name) R/o, 8/150- a, Sreeramula Peta, Proddatur, YSR Dt Ap Have Changed My Name as **CHEEKATI MAHAVISHNU NAIDU** (New name), S/O CHEEKATI ANNAIAH NAIDU.

I,**Komma subrahmanyam**,(old Name) R/o, 10/304-3, Bala Nagar, Kodur, Kadapa DT AP. Have Changed My Name as **KOMMA SUBRAMANYAM YADAV** (new name), S/O KOMMA SUBBARAYUDU.

# ప్రచార సామాగ్రిపై టిడిపి అత్యుత్సాహం



-అక్కడ నిలువ చేసింది కేవలం ప్రచార సామాగ్రి మాత్రమే
-ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులుంటే జప్తు చేసుకోవచ్చు
-ఒంగోలు వైకాపా ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

**తిరుపతిరూరల్, మార్చి 27 ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కొనుగోలు చేసిన ప్రచార సామాగ్రిపై టిడిపి కూటమి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయని ఒంగోలు వైకాపా ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కొనుగోలు చేసిన ప్రచార సామాగ్రిపై దుష్ప్రచారం తగదన్నారు. పార్టీకి ప్రచార సామాగ్రిని 2023 అక్టోబర్ నుండి 2024 మార్చి 14వరకు వివిధ తేదీలలో పలు సంస్థల నుంచి జీఎస్టీని చెల్లించి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ప్రచార సామాగ్రిని రేణిగుంట సమీపంలోని పాత విమానాశ్రయం రోడ్డులోని గోదాములో నిల్వ చేసినట్లు తెలిపారు. గోదాములలో పార్టీ పల్ల కార్డులు, జెండాలు, కండువాలు, టోపీలు, వివిధ రకాలైన ప్రచార సామాగ్రి మాత్రమే అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే బహుమతి సామాగ్రి ఎక్కడా లేదన్నారు. ఓటర్లను తికమక పెట్టేందుకు టిడిపి కూటమి ఆడుతున్న డ్రామా మాత్రమే అన్నారు. ప్రచార సామాగ్రికి సంబంధించిన అన్ని బిల్లులు ఉన్నాయని, ఎలాంటి సందేహాలకు తావు లేదన్నారు.

## మంచినీటిని సంరక్షించుకోవాలి..కమిషనర్

**శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త :**



వేసవికాలం సందర్భంగా పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండాలని ఇందుకు ప్రజలు సహరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం సందర్భంగా భూగర్భజలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని శ్రీకాళహస్తి పురపాలక సంఘం త్రాగునీటి అవసర నిమిత్తం ప్రస్తుతం 294 చేతిపంపులు, 42 పవర్‌బోర్ వెల్స్ మరియు తెలుగుగంగ ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రాబోవు మూడు మాసాల్లో భూగర్భజలాలు గణనీయంగా అడుగంటే పరిస్థితులు ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారన్నారు. అలాగే పట్టణంలో వీధికుళాయిల వద్ద అవసరమయ్యే నీరు వినియోగించిన తర్వాత కుళాయిలను వెంటనే కట్టివేయాలన్నారు. ఇంటి కుళాయిల యజమానులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. పాదాచారులకు మరియు వాహనదారులకు వేసవి దృష్ట్యా పట్టణంలో చలివేంద్రాలు శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పురపాలక సంఘం వారి విన్నపాన్ని పట్టణ ప్రజలు మన్నించి పురపాలక సంఘం శ్రీకాళహస్తి ప్రజలు సహకరించాలన్నారు. సేవ్ వాటర్-సేవ్ ఫ్యూచర్ అనే నినాదాన్ని ఆచరించాలని కోరారు. పట్టణంలో ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. డిఈఈ 9849907506, ఎఈఈ 9000030436, సుబ్రమణ్యంరెడ్డి(1 నుంచి 9వ వార్డు వరకు గల ఫిట్టర్)9100929867, జనార్ధన్(10 నుంచి 18వ వార్డు వరకు గల ఫిట్టర్) 9100929867, తులసి(19 నుంచి 27వ వార్డు వరకు గల ఫిట్టర్)9100929867, మునికుమార్(28 నుంచి 35వ వార్డు వరకు గల ఫిట్టర్) 9100929867 నంబర్లకు ఫోన్‌చేయాలన్నారు.

## బర్డ్‌కు మరో ఆధునిక సాంకేతిక మణిహారం

-దాతసహకారంతో రూ.కోటితో అత్యాధునిక కృత్రిమ అవయవాల తయారీ యంత్రాలు

**తిరుపతి హెల్త్, మార్చి 27 ప్రభాతవార్త :**



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు వేగంగా అందిస్తున్న బర్డ్ ఆసుపత్రికి బుధవారం రూ. కోటి విలువ చేసే అత్యాధునిక కృత్రిమ అవయవాల తయారీ యంత్రాలను సేలంకు చెందిన దాత బాలసుబ్రమణ్యం విరాళంగా అందించారు. బర్డ్ ఆసుపత్రిలో బుధవారం పూజలు నిర్వహించి దాత బర్డ్ ప్రత్యేకాధికారి డా. రాచపల్లి రెడ్డప్పకి అందజేసారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని డా. రాచపల్లి రెడ్డప్ప రెడ్డి కోరారు.

## పురాతనమైన తాళపత్ర గ్రంథాలు...

అద్భుతంగా రక్షించబడుతున్నాయి
-వేదవిశ్వవిద్యాలయంలో సుప్రీంకోర్టు సిజె జస్టిస్ చంద్రచూడ్



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:**
తాళపత్ర గ్రంధాల రక్షణ దేశవ్యాప్తంగా చేయాలని, తిరుపతి ఎస్వీవేదవిశ్వవిద్యాలయంలో అత్యంత పురాతనమైన తాళపత్ర గ్రంధాలు ఇక్కడ అద్భుతంగా రక్షించబడుతున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న పురాతన న్యాయ శాస్త్ర గ్రంధాల గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. ఆ కాలంలో ఉన్న నాగరికతలో న్యా యం ఎలా ఉండేది, న్యాయ విద్యను ఎలా అభ్యసించే వారు, పురాతన న్యాయశాస్త్రం లక్ష్యం మొదలైన విషయాలు ఆచార్యులు వివరించడం జరిగిందన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వేది విశ్వవిద్యాలయంలో టిటిడి, వేదవిశ్వ విద్యాలయం ఆధ్వర్యం లో సంరక్షిస్తూ డిజిటలైజేషన్ చేస్తున్న తాళపత్రాలను బుధవారం మధ్యాహ్నం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ సందర్శించారు.

## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం

-పుట్టినరోజున వెంకన్న ఆశీస్సుల్లో సినీనటుడు రామ్‌చరణ్

**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:**



తనపుట్టినరోజున స్వామివారిని దర్శించుకోవడం మనసు ఎంతో సంతోషపడిందని సినీన టుడు ,మెగాస్టార్ చిరంజీవి కుమారుడు రామ్‌చరణ్ తెలిపారు.ఆయన పుట్టినరోజును బుధవారం ఉదయం రామ్‌చరణ్,సతీమణి ఉపాసన, కుమార్తె క్లీంకారతో కలసి సాంప్రదాయ దుస్తుల్లో తిరుమలలో జరుపుకున్నారు. ఆలయం వెలుపల రామ్‌చరణ్ దంపతులను చూడటానికి, వారిలో కరచాలనం చేయడానికి అభిమానులు, టిటిడి సిబ్బంది ఉత్సాహం చూపారు.

## దేవుని దర్శనంతో మనసు ప్రశాంతం

– సిజెఐ జస్టీస్ చంద్రచూడ్

**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:**



శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు చాలా ప్రశాంతంగా ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. జస్టిస్ చంద్రచూడ్ దంపతులు ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు.

## బీసీలకు న్యాయం చెయ్యని వైసిపికి రాజీనామా చేస్తున్నా

-ఏపీ బీసీ జేఏసి చైర్మన్ అన్నరామచంద్రయ్య వెల్లడి

**తిరుపతి హెల్త్, మార్చి 27 ప్రభాతవార్త :**



గతంలో వైసిపి పాలన రావడానికి పూర్తి సహకారం అందించి, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల గెలుపుకు అలాగే రాష్ట్రంలోని మిగతా శాసనసభ్యులు గెలుపుకు తాను కృషి చేశానని ఇంత చేసినా బీసీ కులాలకు వైసిపి న్యాయం చేయకపోవడాన్ని బాధ కలిగించి తాను వైసిపి క్రియాశీలక, ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా ముందు అన్నా రామచంద్రయ్య యాదవ్ బహిర్గతం చేశారు. అనంతరం అన్నా రామచంద్రయ్య యాదవ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లకు సంబంధించి బీసీలకు వైసిపి న్యాయం చేయకపోవడం ఆవేదనను కలిగించిందన్నారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఉంటూ బీసీల మేలు కోరారన్నారు. సిఎం సొంత కడప జిల్లాలో యాదవులకు కేటాయించిన ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ స్థానాలను కోల్పోయామన్నారు. వైసిపిలో కొనసాగుతున్న పెత్తందారి విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఐదేళ్ల దిగమింగుకొని పడ్డ బాధ, నేడు రాజీనామా రూపంలో రూపుదిద్దుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రలోభాలకు లోనుకాకుండా...

ఓటుహక్కును వినియోగించుకోండి..ఆర్డీవో



**తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త :**
ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి 'మన ఓటు మన హక్కు' అనే కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బాబుఅగ్రహారం నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు సాగింది. ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఓటరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవోపిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు నూతనంగా ఓటు నమోదైన యువత, ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మన ఓటు-మన హక్కు కార్యక్రమం ర్యాలీని చేపట్టామని ప్రతి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇక నాలుగు మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిరోజు ఓటర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. తమ ప్రాంతంలోని ఏపోలింగ్ బూత్‌లో గత ఎన్నికల్లో ఓటు శాతం తక్కువగా నమోదైందో ఆప్రాంతాల్లో అవగాహన కల్పించి ప్రజలకు చైతన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి తహశీల్దార్ జనార్ధన్‌రాజు, తొట్టంబేడు తహశీల్దార్ శివరామసుబ్బయ్య, మరియు బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల రోడ్డు సమస్య పరిష్కారం

**నగరి, మార్చి 27 ప్రభాతవార్త:**



నాలుగు దశాబ్ధాలుగా నింద్ర మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ, ఎస్టీ కాలనీ, ఇరుగువాం, ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటర్‌లో నివశించే 600లకుపైగా కుటుంబాలు ఎదుర్కొన్న సమస్యకు తెరపడింది. నూతన బీటీ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేసి సుమారు రెండు కి.మీ మేర నిర్మించే ఈ రోడ్డుకు ఈ ఏడాది జనవరి 26న మంత్రి రోజా భూమిపూజ చేశారు. నాడు ప్రారంభమైన రోడ్డు పనులు వేగంగా జరుగుతూ ప్రస్తుతం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గత పాలనలో 56.23 లోల మంజూరు చేసినట్లు ఆర్భాటాలు చేసి భూమిపూజ చేసి శిలాఫలకం వేసినా రోడ్డు పనులు అణువంతైనా ప్రారంభం కాలేదు. రెండు నెలల క్రితం ప్రారంభమై పనులు పూర్తి కావడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దశాబ్ధాలుగా ఎవరూ చేయనటువంటిపనులు పూర్తి చేస్తూ వచ్చిన మంత్రి రోజా మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. రోడ్డు పనులు పూర్తి కావడంపట్ల గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే పనులు చేసిపెట్టడంలో ఎప్పుడూ ముందుండే మంత్రి మేము తీసుకెళ్లిన సమస్య పట్ల కూడా వేగంగా స్పందించారని ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం వేసిన రోడ్డు గోవిందప్పనాయుడు కండ్రిగ, ఎస్టీ కాలనీ, ఇరుగువాయి, ఎస్సీ కాలనీ, ఆరూరు, ఆరూరు సెంటర్ వరకు అందరికి ఉపయోగపడుతుందన్నారు.

## ఎన్నికల కోడ్‌ను అమలు చేయడం మనందరి బాధ్యత

– పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని తడ తహశీల్దార్ సూచన

**తడ, మార్చి 27 ప్రభాతవార్త :**




తడ మండలంలో ఈ సారి ఎన్నికల కోడ్‌ను అమలు చేయడం కాకుండా సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపుదలకు సమష్టిగా కృషి చేయాలని తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తడలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బిఎల్ఓలు, సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సెక్టార్ పోలీసు అధికారులతో ఈ సమావేశం నిర్వహించారు. పోలింగ్‌స్టేషన్ల సమీపంలో కోడ్‌ను ఉల్లంఘించే చర్యలు చేపట్టకూడదని, నిబంధనలు ఖచ్చితంగా పాటించడానికి అంతా కృషి చేయాలన్నారు. కొత్తగా చేరిన యువ ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు ఓటింగ్ శాతం పెరగడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌తో పాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌ను కలిసిన గూడూరు ఎమ్మెల్యే

**గూడూరు రూరల్, మార్చి 27 ప్రభాతవార్త :**



మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కల్యాణ్‌ను గూడూరు ఎమ్మెల్యే, బిజెపి తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెళ్ల మనోహర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. 2014 ఎన్నికల్లో తిరుపతి ఎంపీగా పోటీ చేసి గెలిచిన వరప్రసాదరావు, 2019 ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతర పరిణామాల్లో 2024 ఎన్నికల్లో వైసీపీ టికెట్ కేటాయించకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన భారతీయ జనతా పార్టీలో చేరిపోయారు. తనను రాజకీయాల నుంచి ఎవరూ దూరం చేయలేరంటూ ఇటీవల ఆయన గూడూరులో వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ నాయకులతో దూరంగా ఉన్న ఆయన కూటమి అభ్యర్థి కావడంతో అందరితో కలిసిపోతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో పవన్ కల్యాణ్, నాదెళ్ల మనోహర్‌లతో కలిశారు.

## చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు

**కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త**



రెండు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుకు కుప్పం పర్యటన ముగియడంతో ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం ఉదయం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం నుంచి చంద్రబాబు కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి పలమనేరుకు చాపర్‌లో బయలుదేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్టీ శ్రేణుల్లో చైతన్యం కలిగించడం తదితరాలపై ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కుప్పంలో లక్ష ఓట్ల మెజార్టీ సాధనే ధ్యేయంగా శ్రమిస్తామని ఈసందర్భంగా డా॥ కంచర్ల చంద్రబాబునాయుడుకు వివరించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.






## మరో గోదాములో అధికార పార్టీ...

### ఎన్నికల ప్రచార సామగ్రి గుర్తింపు

**రేణిగుంట, మార్చి 27 ప్రభాతవార్త:**
రేణిగుంట మండలంలో బుధవారం మరో ప్రధాన ప్రైవేటు గోదాములో అధికార పార్టీకి చెందిన ఎన్నికల ప్రచార సామగ్రిని టీడీపీ నేతలు గుర్తించారు. అందులో లభించిన ప్రచార సామగ్రిని సీజ్ చేయాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ బొజ్జల సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం విమానాశ్రయం వెళ్లే మార్గంలోని ప్రైవేటు గోదాములతో పాటు లారీలో ఉన్న సామగ్రిని గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసి టీడీపీ నేతలు అప్పగించారు. మరల బుధవారం రేణిగుంట-శ్రీకాళహస్తి మార్గంలోని మరో గదాములో అధికార పార్టీకి చెందిన ఎన్నికల ప్రచార సామగ్రిని టీడీపీ నేతలు గుర్తించారు. దీనిపై కూడా అధికారులకు ఫిర్యాదు చేశారు.



ఆగ్రహించిన బొజ్జలసుధీర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో అధికార పార్టీని విమర్శించారు. అధికారుల పనితీరును తప్పుపట్టారు. టీడీపీ మండల నేతలు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, భాస్కర్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, అడ్వకేట్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, గోదాముల వద్ద ఉన్నారు. రాష్ట్ర టీడీపీ నేత రెడ్డివారి గురువారెడ్డి గోదాముల వద్దకు వచ్చారు. రాత్రి నుంచి ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సలోమి అక్కడే ఉన్నారు. రేణిగుంట తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బందితో పరిస్థితుల సమీక్షిస్తూ ఎప్పకటిప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. రూరల్ సీఐ సుబ్బరాయుడు, అర్బన్ సీఐ మల్లికార్జున్, గాజులమండ్యం ఎస్ఐ సునీల్, అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, తమ సిబ్బంది, స్పెషల్ ఫోర్స్‌తో ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.